క్లుప్తంగా

ఘనంగా ధనుర్మాస పూజలు



వేణుగోపాలస్వామివారికి హారతి ఇస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సీతానగరం: ధనుర్మాసోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పలుగ్రామాల్లో ఘనంగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం గోవింద మాలధారణ చేసిన భక్తులు నగరసంకీర్తన, మేల్కొలుపు, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిరోజూ వేకువజామునలేచిన భక్తులు సువర్ణముఖినదిలో సంధ్యావందనం చేసిన అనంతరం వేణుగోపాలస్వామి, రాములవారి ఆలయాల్లో పూజలు చేయడం, నగర సంకీర్తన చేస్తున్నారు. అలాగే శతాబ్దాలకాలం నాటి వేణుగోపాలస్వామి విగ్రహాన్ని పల్లకిలో ఊరేగిస్తూ అభిషేకాల్లో పాల్గొంటున్నారు.

నేడు విద్యుత్‌సరఫరాలో అంతరాయం

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ జె.సింహాచలం కోరారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు నిర్వహిస్తామని ఈ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నిరుపేదలకు సాయం చేయాలన్నదే ఆకాంక్ష



పేదలకు ఆర్థిక సాయం చేస్తున్న నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యులు

పార్వతీపురంటౌన్: నిరుపేదలకు సాయం చేయాలన్నదే నోబుల్ వాకర్స్ క్లబ్ లక్ష్యమని వాకర్స్‌క్లబ్ సభ్యులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్లు, బస్టాండ్ల వద్ద నివసిస్తున్న నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సభ్యులు ఆర్.సత్యంనాయుడు, జె.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

● జేసీ గోవిందరావు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జేసీ గోవిందరావు

పాచిపెంట: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జేసీ గోవిందరావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో బియ్యం పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు సమస్యలపై చర్చలు



గుణుపూర్ పోలీస్‌లతో చర్చిస్తున్న సీఐ చంద్రమౌళి, బత్తిలి ఎస్ఐ ప్రసాద్

భామిని: ఆంధ్రా – ఒడిశా సరిహద్దులో రానున్న సాధారణ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా ఆంధ్రా – ఒడిశా పోలీసులు శుక్రవారం సమన్వయ చర్చలు జరిపారు. పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి చొరవతో బత్తిలి ఎస్ఐ చిట్టిపోలు ప్రసాద్ ఆధ్వర్యంలో ఒడిశాలోని గుణుపూర్, కాశీనగర్ పోలీస్‌స్టేషన్లతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి చర్చించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఏఓబీలో వివాదాలు తలెత్తకుండా సమన్వయంతో కలసి అవాంఛనీయ సంఘటనల నివారణకు పరస్పరం చర్చించుకునేందుకు అనువుగా పరిచయాలతో పాటు కలిసి పని చేయడానికి నిర్ణయించారు. గుణుపూర్ సీఐ ఉత్తమకుమార్ సాహూల ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. తెలుగు – ఒడియా రాష్ట్రాల సరిహద్దులో వివాదాల నివారణకు ఐక్యంగా పని చేయడానికి నిర్ణయించారు.

పేదల జీవన ప్రమాణం పెంపుకోసం

సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదకుటుంబాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో కొత్త పింఛన్లు, పెరిగిన పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, జగనన్న పాలనలో ప్రజలందరూ ఆర్థిక, సామాజిక అభివృద్ధి చెందడంతో వారి కుటుంబాల్లో మనోధైర్యం పెరిగినట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక భరోసా కారణంగా పేదల ఇళ్లలో పిల్లలను చదివించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. జీవితం భారం కాకూడదనే ఉద్దేశంతో



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్ దారులు

ప్రతి అక్క, చెల్లెమ్మ, రైతు, వివిధ వర్గాలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని తెలియజేశారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి

గత ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలను చంద్రబాబు మోసం చేస్తే జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు అండగా ఉంటున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలకు రూ.వందల కోట్ల వ్యయంతో సువర్ణముఖినదిపై నారాయణపురం వంతెన, గెడ్డలుప్పివంతెన ఇంటింటి కుళాయిలు బీటీరోడ్లు, సీసీ కాలువలు, మంచినీటి పథకాలు, సాగునీటి కాలువలు నిర్మాణం చేపట్టడంతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని తెలియజేశారు. లబ్ధిపొందిన పింఛన్ దారులు సీఎం జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి. రమణమ్మ, జెడ్పీటీసీ ఎం బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి. చిట్టిరాజు, స్థానిక ఎంపీటీసీలు బి.కుసుమ, ఎస్.గౌరి, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, పార్టీ నాయకులు పార్థసారథి, ఈశ్వరనారాయణ, రామకృష్ణ, జిల్లా నాయకులు వెంపలి గుర్రాజు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పాల్గొన్న పింఛన్ లబ్ధిదారులు

జగనన్నకు రుణపడి ఉంటాను



నేను రైతుకూలీ కుటుంబానికి చెందిన అంధుడిని. గత ప్రభుత్వం రూ.1000 పెన్షన్ ఇవ్వడంతో ఇబ్బందులు పడ్డాను. జగనన్న ప్రభుత్వం రూ.3 వేలకు పెన్షన్ పెంచడంతో ఇంకొకరిపై ఆధారపడకుండా జీవించగలను. ఈ భరోసా కల్పించిన జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాను.

పగిరెడ్డి పోలినాయుడు, తామరఖండి

నాకు పెన్షనే ఆధారం



నాకు భర్తలేడు. ఒక కుమారుడున్నాడు. జీవనోపాధిలేక అవస్థలు పడుతున్న సమయంలో అర్హతను గుర్తించి ప్రభుత్వం పింఛన్ మంజూరుచేసింది. నాకొడుకు మూడవ తరగతి చదువుతున్న కారణంగా జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా నా ఖాతాలో రూ.15 వేలు పడింది, దుస్తులు, షూస్ సమకూర్చారు. వలంటీర్ ద్వారా ఇంటినుంచే దరఖాస్తు చెయ్యగానే ఇప్పుడు పింఛన్ కొత్తగా వచ్చింది.జగనన్న ప్రభుత్వానికి ధన్యవాదాలు.

యజ్జల చిన్నమ్మి, కాశీపేట

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి



తుమరాడ పాఠశాలలో విద్యార్థుల నోట్‌పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: విద్యార్థులు చదవడం, రాయడం నేర్చుకుని వారి నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఎంఈఓ-1సామల సింహాచలం సూచించారు. ఈ మేరకు ఆయన బలిజిపేట మండలంలోని తుమరాడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ముందుగా విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, వర్క్‌పుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించి విద్యార్థులతో పాఠ్యాంశాలు, బోర్డుపై పదాలు రాసి చదివించారు. విద్యలో మంచి మెలకువలు నేర్చుకోవాలని, మంచి రాత ఇప్పటినుంచి నేర్చుకుంటే రానున్న తరగతుల్లో బాగుంటుందని హితవు పలికారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, మధ్యాహ్నభోజన పథకం వంటలను రుచిచూసి సంతృప్తి చెందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ

పార్వతీపురంటౌన్: బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని పార్వతీపురం మన్యం జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం అయన పట్టణంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడానికి గల కారణాలు, చిన్న వయస్సులో బాలికలకు వివాహం చేసినట్లైతే కలిగే దుష్ప్రభావాలను వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఎటువంటి సమస్యలు ఉన్నా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పి.శ్రీధర్, జి.తవిఇనాయుడు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన



పెదబుడ్డిడిలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ అసిస్టెంట్ కాంతారావు

జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో ఓటు ఎలా వేయాలన్న దానిపై ఓటర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సీనియర్ అసిస్టెంట్ బి.కాంతారావు, సిబ్బందితో కలసి రానున్న ఎన్నికల దృష్ట్యా ముందస్తుగా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేటట్టు, ఓటు రద్దు కాకుండా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఓటు విలువపై అవగాహన కల్పించి ఓటర్లంతా ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బాబూ భువన మోహనరావు, యువత, ఓటర్లు పాల్గొన్నారు.

మరుపెంటలో పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరంలో పరిశీలిస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల నివారణ కార్యక్రమాన్ని మండలంలోని మరుపెంట గ్రామంలో శుక్రవారం ఎంపీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పాడి సంపద అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గరుగుబిల్లి ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.గణపతిరావు మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఉంటాయన్నారు. ఈ నెల 31 వరకు గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహించి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.శ్రీరాములనాయుడు, సిబ్బంది వెంకటి, పైడిరాజు, గణేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో శ్రమదానం



ఎంపీడీఓ కార్యాలయ పరిసరాల్లో శ్రమదానం చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

భామిని: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన తుప్పలు, చెత్తను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సిబ్బంది శ్రమదానం చేశారు. తుప్పలను తొలగించి మంట పెట్టారు. కార్యాలయ పరిసరాలను శుభ్రపరిచారు. కార్యదర్శి విశ్వేశ్వరరావు, మండల పరిషత్ సిబ్బంది శ్రమదానంలో పాల్గొన్నారు.

అవగాహన అవసరం



భాసూరు గ్రామంలో ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎండీవీ సిబ్బంది

పాలకొండ రూరల్: ఈవీఎంల ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే విధానంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మొబైల్ డిమానిస్ట్రేషన్ వాహన సిబ్బంది పైల ఈశ్వరరావు అన్నారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, ఐటీడీఏ పీఓ కల్పనకుమారి ఆదేశాలతో శుక్రవారం మండలంలోని భాసూరు గ్రామ ఓటర్లుకు ఈవీఎం యంత్రాల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ఎండీవీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామీణ ఓటర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో సాంకేతిక విధానంపై సిబ్బంది ఎ.ధర్మారావు, జి.ప్రసాదరావు, ఎస్.రాజారావు తదితరులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, సర్పంచు శిర్లాపు మల్లేశ్వరమ్మ, గురువినాయుడు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని కేర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారం మేరకు సంతకవిటి పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక దాడులు చేసి, జూదరులను పట్టుకున్నామన్నారు. నిందితుల నుంచి రూ.65,410 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

వికసిత్‌భారత్ గ్రామసభలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న భారత్ వికసిత్ జిల్లా కోఆర్డినేటర్ రెడ్డి సింహాచలం

సీతానగరం:

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వికసిత్ భారత్ గ్రామసభలను విజయవంతం చేయాలని వికసిత్ భారత్ జిల్లా కో ఆర్డినేటర్ రెడ్డి సింహాచలం కోరారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో సచివాలయం వద్ద వికసిత్ భారత్ అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోఆర్డినేటర్ రెడ్డి సింహాచలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీలు, సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో కేంద్రం వాటాలను వివరించారు. అలాగే అందిస్తున్న వైద్య సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం, వెలుగు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బక్కుపేటలో..

అలాగే మండలంలోని బక్కుపేటలో కూడా వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీపై పంపిణీ చేస్తున్న పరికరాలను వివరించారు. గ్రామంలోని రామమందిరం వద్ద ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వికసిత్ భారత్ మండల కోఆర్డినేటరు పాల్గొన్నారు.

జగనన్న 'సురక్ష' పాలన

● జెడ్పీటీసీ రవికుమార్



జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరంలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: జగనన్న పాలనలో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించి వారిని సురక్షంగా ఉంచాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వంతరాంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా శిబిరంలో ప్రతి కౌంటర్ వద్ద రోగులకు ఎటువంటి వైద్యసేవలు అందుతున్నాయి, ఏఏ రకాల మందులు అందిస్తున్నారో పరిశీలించారు. రోగుల వద్ద కూర్చుని వైద్యసేవలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల సన్యాశినాయుడు, ఎంపీడీఓ విజయలక్ష్మి, సిబ్బంది, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రతీ రైతు శాస్త్రవేత్త కావాలి



మాట్లాడుతున్న డా.సురేష్‌కుమార్

కురుపాం: ప్రతీ రైతును శాస్త్రవేత్తలా తయారు చేయాలని, ఏజెన్సీలో అగ్రి టూరిజం అభివృద్ధికి కేవీకే శాస్త్రవేత్తలు మరింత కృషి చేయాలని చింతపల్లి అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.సురేష్‌కుమార్ అన్నారు. కురుపాం పంచాయతీ కేంద్రం శివ్వన్నపేటలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల నైర విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు ఆధునిక వ్యవసాయ సాగు, అధిక దిగుబడులు సాధించే విధంగా పంటల వైపు దృష్టి సారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రతీ రైతును శాస్త్రవేత్తల్లా తయారు చేసే బాధ్యతను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రొగ్రాం కో ఆర్డినేటర్ పాత్రో, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డా.చిన్నంనాయుడు, శాస్త్రవేత్తలు, నైర కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించండి

గుమ్మలక్ష్మీపురం: మన్యం జిల్లా పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని భద్రగిరి పీటీటీ బాలికలు పాఠశాలకు రెగ్యులర్ మహిళా ప్రిన్సిపాల్‌ను, సీతానగరం మండలం జోగింపేట ప్రతిభ పాఠశాల/కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకలు తాడింగి సాయిబాబు, పాలక రంజిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక వైపు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కొరత మరో వైపు ప్రిన్సిపాళ్ల కొరతతో గిరిజన గరుకుల విద్య తిరోగమన దిశలోకి పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఖాళీల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

వైద్యసేవలు విస్తృతం చేయాలి



గ్రీజర్లకు సంబంధించిన పత్రాలను ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి తదితరులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం సమకూరుస్తున్న వనరులు సద్వినియోగపర్చుకుంటూ వైద్యులు తమ సేవలను మరింత మెరుగ్గా ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. శుక్రవారం జరిగిన స్థానిక ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వీరు మాట్లాడారు. ఆస్పత్రి జి.నాగభూషణరావు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం ద్వారా 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సివిల్ వర్కులకు సంబంధించి ఏపీ ఎంఎస్ఐడీసీ ద్వారా రూ.3కోట్ల రూపాయల పనులకు టెండర్లు పిలవటం జరిగిందని, రోగుల అవసరాల మేరకు సోలార్ పవర్ ద్వారా వేడి నీరు అందుబాట్లోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. రక్త నిల్వల కేంద్రం అభివృద్ధి, సిబ్బంది ఖాళీల భర్తీ తదితర అంశాలను సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రెండు గ్రీజర్లు తన వంతుగా అందించారు. సమావేశంలో ఆస్పత్రి ఆర్ఎంఓ జె.రవీంద్రకుమార్, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

మున్సిపాలిటీలో చెత్త సమస్య లేకుండా చర్యలు

● మున్సిపల్ ఆర్‌డీ నాగరాజు



పారిశుద్ధ్య పనులపై ఆరాతీస్తున్న మున్సిపల్ ఆర్‌డీ నాగరాజు

రాజాం: మున్సిపాలిటీల్లో చెత్త సమస్య లేకుండా అన్నిరకాల చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ శాఖ ఆర్‌డీ ఇ.నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పట్టణంలో కాంట్రాక్ట్ మున్సిపల్ కార్మికుల సమ్మెపై ఆరాతీసిన అనంతరం వార్డుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజుతో మాట్లాడి, రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులతో పాటు రోజువారీ వేతనానికి వచ్చే కార్మికులతోనూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులకు వార్డుల వారీగా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాలన్నారు. ప్రతీ వీధిలో వెదురు చెత్తబుట్టలు, గోనెసంచులు వంటివి ఏర్పాటు చేసి, చెత్తను పట్టణ వాసులు బయట పారవేయకుండా చూడాలన్నారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య కార్మికుల సమ్మెను దృష్టిలో ఉంచుకుని, మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు. చెత్తను, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయవద్దన్నారు.